క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

కొమరోలు: మండలంలో శనివారం పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. జూన్ 1వ తేదీన ఆదివారం కావడంతో మే 31వ తేదీన పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 5,495 మంది లబ్ధిదారులకు జూన్ నెల పింఛను అందిస్తున్నట్లు తెలిపారు.

గిద్దలూరులో భారీ వర్షం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురవడంతో పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. రాజానగర్, శ్రీరామ్‌నగర్, నల్లబండబజారు, ఆర్టీసీ బస్టాండ్ వీధి, కోటగడ్డ వీధి, అంకాలమ్మబజార్, అర్బన్‌కాలనీతో పాటుగా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వర్షం నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ కె.శ్రీనివాస్ తెలిపారు. బేస్తవారిపేట, పాపాయిపల్లెలో విద్యుత్ లైన్ వెంట చెట్లకొమ్మలు తొలగిస్తున్నందున సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన

మార్కాపురం: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాల స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్నకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించనున్న పాఠ్య పుస్తకాలు, బెల్టుల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యామిత్ర సామగ్రిని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓవీ వీరారెడ్డి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యదర్శులకు కష్టాల యోగం!

- యోగా డే యాప్ సర్వే పేరుతో సర్కారు టార్గెట్లు
- యాప్‌లో ఓటీపీలతో ఉద్యోగులకు ఇక్కట్లు
- యోగా డే యాప్‌తో మరింత భారం మోపారని ఆవేదన
- ఉద్యోగులు అందుబాటులో లేక ప్రజలకు ఇబ్బందులు


యోగా శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో అధికారులను ముప్పుతిప్పలు పెడుతోంది. ప్రతి పనికి సర్వేల పేరుతో ఇటు సచివాలయ సిబ్బందిని, అటు ప్రజలను ఏదో రకంగా ఇబ్బంది పెడుతున్నారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పీ4, గృహాలకు ఆధార్ నమోదు ఇలా నిత్యం ఏదో ఒక సర్వే పేరుతో కార్యదర్శులను ఉక్కిబిక్కిరి చేస్తున్నారు. రకరకాల సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పిస్తూ వలంటీర్ల యాప్‌లు కూడా తమకే అంటగట్టడాన్ని కార్యదర్శులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇవన్నీ చాలదన్నట్లు ఇప్పుడు యోగా యాప్ అంటూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయమని ఆదేశించడంతో తలపట్టుకోవడం సచివాలయ ఉద్యోగుల వంతయింది.

యోగా సర్వే ఇలా..


యోగాంధ్ర యాప్

కార్యదర్శులు తమ పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి యోగా యాప్ చూపించి వారు వస్తారో లేదో తెలుసుకుని వివరాలు నమోదు చేయాలి. వెళ్లడానికి సదరు వ్యక్తి ఆసక్తి చూపిస్తే వారి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీని అందులో నమోదు చేసి సబ్మిట్ చేయాలి. అంత వరకు ఓకే. కానీ వారు రారు అని చెప్పినా యాప్‌లో వివరాలు పొందుపరిచి నో ఆప్షన్ పెట్టినా మొబైల్ నంబర్, ఓటీపీ నమోదు చేయాల్సి వస్తోంది. తాజాగా నో ఆప్షన్ పెట్టిన కుటుంబ సభ్యుల్లో ఒకరిది ఫేషియల్ రికగ్నిషన్ లేదా బయోమెట్రిక్ సబ్మిట్ చేయాలి. ఇలా రాని వారి కోసం ఓటీపీ అడిగి, ఫేస్ ఫొటోలు తీసి, బయోమెట్రిక్ కావాలని అడుగుతుంటే ప్రజలు ఎందుకివ్వాలని ప్రశ్నించడంతోపాటు విసుక్కుంటున్నారు. వెళ్లడానికి ఆసక్తి లేదని నిరాకరించినా ఇవన్నీ దేనికని కార్యదర్శులను నిలదీస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో కార్యదర్శులు ఉన్నారు. అసలే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేపర్లు, సోషల్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రభుత్వం, పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న తరుణంలో ఓటీపీలు అడగడమేంటని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఒకవైపు శిక్షణ.. మరోవైపు పోటీలు

మూడు రోజుల క్రితం యోగాంధ్ర యాప్‌లో పంచాయతీల్లో యోగాసనాలపై మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చినట్లు వివరాలు నమోదు చేయాలని పెట్టారు. ఒకవైపున మండల స్థాయిలో మాస్టర్స్ ట్రైనర్స్‌తో శిక్షణ కార్యక్రమాలు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సచివాలయ స్థాయిలో యోగా తరగతులు నిర్వహించాలని అధికారులు ఇప్పటికే సూచించారు. ఇది పూర్తి కాకుండానే పంచాయతీల్లో పోటీలు ఎలా పెట్టాలో, వారికి శిక్షణ లేకుండానే ఎలా పాల్గొంటారో అర్థం కావడం లేదని సచివాలయ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

వేల మంది సాధ్యమేనా..?

ఒక్కో సచివాలయ పరిధిలో వేలాది మందిని సర్వే చేసి యోగాలో పాల్గొంటున్నదీ లేనిదీ నమోదు చేయాలంటే ఎన్ని రోజులు పడుతుందో ఉన్నతాధికారులకే ఓ అంచనా లేదు. అన్నీ బాగుండి సర్వర్ మొరాయించకపోతే సర్వే పూర్తి చేయడానికి ఒక్కో వ్యక్తి దగ్గర కనీసం 10 నిమిషాలు పడుతోంది. దీంతో కార్యదర్శులు ప్రజా సేవలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం సచివాలయాల వద్దకు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు, ఏదో ఒక పనిపై వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ తరుణంలో సర్వేల పేరుతో కార్యదర్శులు బయటకు వెళ్తుండటంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నీరుగార్చి అస్తవ్యస్తంగా మారుస్తోందన్న విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

పోతలపాడులో నీటి కష్టాలు

- విద్యుత్ స్టార్టర్‌ను సచివాలయానికి తరలించిన పంచాయతీ కార్యదర్శి


స్టార్టర్ తొలగించిన డీప్‌బోర్

తర్లుపాడు: మండలంలోని పోతలపాడులో పంచాయతీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రజలకు నీటి కష్టాలు తలెత్తాయి. డీప్‌బోర్ స్టార్టర్ బాక్స్‌ను పంచాయతీ సెక్రటరీ సచివాలయానికి తరలించడంతో ప్రజలు గుక్కెడు నీటి కోసం విలవిల్లాడుతున్నారు. ఇళ్లలో వాడుకునేందుకు, పశువులకు అవసరమైన నీటిని దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోలేక అవస్థలు పడుతున్నారు. దీనిపై పంచాయతీ సెక్రటరీని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిల్లు చేయకుండా వేధింపులు

గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి అప్పు చేసి డీప్‌బోర్‌ను ఏర్పాటు చేస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బిల్లులు చేయకుండా కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. గత వారం మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరును సర్పంచ్ నిలదీయగా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. పది రోజులు గడిచినా అధికారులు బిల్లు చేయలేదు.

పోరాటాలతోనే కార్మిక హక్కులు పదిలం


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

పొదిలి: ప్రభుత్వాలు హరిస్తున్న కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు సీఐటీయూ నిత్యం పోరాడుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్‌లో సంస్థ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచే ప్రయత్నాలు చేస్తున్న కార్పొరేట్ శక్తులను కార్మికులు సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నర సింహం, జి.నాగేశ్వరరావు, హనుమంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత చెరువు భూమి పరిశీలన


ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న గిద్దలూరు ఇరిగేషన్ డీఈ రామారావు

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల ఎంఐ ట్యాంక్ చెరువు పరిధిలో ఆక్రమణకు గురైన భూమిని ఇరిగేషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. పామూరుపల్లె గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గిద్దలూరు ఇరిగేషన్ డీఈ రామారావు తమ సిబ్బందితో కలిసి రెడ్డిచెర్ల చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. కొంతమంది వ్యక్తులు చెరువులో పొలం సాగు చేస్తున్నట్లుగా స్థానికుల ద్వారా గుర్తించిన అధికారులు ఆ పొలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరిగేషన్ ఏఈలకు సూచించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి రెడ్డిచెర్ల చెరువు హద్దులు సర్వే చేయాలని చెప్పారు. చెరువు అంతర్భాగంలో ఎవరూ పంటలు సాగు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట కొమరోలు, గిద్దలూరు ఏఈలు సుధాకర్, వెంకటరామిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఉన్నారు.

కనుల పండువగా సీతారాముల గ్రామోత్సవం


నూతన విగ్రహాలు ఊరేగిస్తున్న వేదపండితులు

రాచర్ల: మండలంలోని ఒద్దులవాగుపల్లె పంచాయతీ పరిధిలోని అచ్చంపల్లె గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి నూతన విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా నూతన విగ్రహాల గ్రామోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం నూతన విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ, ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం, రాత్రి 7 గంటలకు గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం


సిద్ధయ్యను సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

కంభం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొంది కొమరోలుకు బదిలీపై వెళ్తున్న పి.సిద్ధయ్యను శుక్రవారం తహసీల్దార్ వి.కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. సిద్ధయ్య విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేశారని తహసీల్దార్ కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఆర్ఐ పీర్సా, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రాచర్లలో యోగా చేస్తున్న అధికారులు

మెరుగైన జీవనశైలికి యోగా దోహదం

బేస్తవారిపేట: ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు మంచి జీవనశైలి అలవడుతుందని తహసీల్దార్ జితేంద్రకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి ఉరుకుల పరుగుల జీవన శైలిలో రోజూ కొద్దిసేపూ యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఏపీఓ గురువరకుమార్, యోగా మాస్టర్ ట్రైనర్స్ మధుసూదనాచారి, బి.వందన, సి.లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీఏలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 4వ రోజు శుక్రవారం యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి, డిప్యూటీ ఎంపీడీఓ బ్రహ్మయ్య, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చివరి రోజు శుక్రవారం యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఓవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో యోగాపై ఉద్యోగులు, స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఏపీఎం రమేష్‌బాబు, యూఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌కుమార్, వీపీఏ రమణ తదితరులు పాల్గొన్నారు.


కొమరోలులో యోగా చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ సుబ్రహ్మణ్యం యోగాసనాలు వేయించారు. ఎంపీడీఓ వీరభద్రాచారి డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


బేస్తవారిపేటలో యోగా చేస్తున్న మహిళలు

కౌలు గుర్తింపు కార్డుల జారీపై అవగాహన


కొమరోలులో మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: పంట సాగు హక్కు పత్రాల జారీపై రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం జారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 1,534 కౌలుకార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్డు కాల పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని, దీని వల్ల భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. దేవదాయశాఖ భూములకు కౌలు కార్డులు ఇవ్వవచ్చని, అసైన్డ్ భూములకు వర్తించదని తెలిపారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి కౌలు కార్డులు మంజూరు చేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, వీఆర్‌ఓలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలో అర్హులైన కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డుల మంజూరుపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో 1074 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

- రైతులకు కేవీకే నోడల్ ఆఫీసర్ సూచన


రైతులతో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి

మార్కాపురం: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం కావాలని, పొలాలను లోదుక్కులు దున్నితే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చని కేవీకే నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పాయపాలెంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏడీఏ బాలాజీనాయక్‌తో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. పంట నమోదు, వివిధ పథకాల గురించి రైతులకు వివరించారు. లోదుక్కులు దున్నడం వల్ల పత్తిలో ఎండు తెగులు, మిరపలో వేరుపురుగు, కందిలో కాయ ఈగ, మారుకా మచ్చల పురుగును నివారించవచ్చని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, ఉద్యానవన అధికారి టి.రమేష్, కంభం, అర్థవీడు, పెద్దారవీడు మండలాల ఏఓలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీబీ ముక్త పంచాయతీగా మంగళకుంట


జేసీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

తర్లుపాడు: క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా చేపట్టిన చర్యలతో తర్లుపాడు మండలంలోని మంగళకుంట టీబీ ముక్త పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ చేతుల మీదుగా పంచాయతీ సెక్రటరీ వీరబ్రహ్మాచారి ప్రశంస పత్రం, మహాత్మగాంధీ కాంస్య విగ్రహం అందుకున్నారు. ఎంపీపీ భూలక్ష్మీ, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఈవోఆర్డీ సుకుమార్, సర్పంచ్ గుమ్మ రాంజేంద్రప్రసాద్, ఆరోగ్య, సచివాలయ సిబ్బందిని జేసీ అభినందించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం


మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి

మార్కాపురం టౌన్: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలాదేవి సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం 2.0 నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మ రక్షణ, అలాగే యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను బాలికలకు వివరించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమ, కార్యకర్త శేషమ్మ, బాలికలు పాల్గొన్నారు.

థియేటర్లు, వ్యాపార కేంద్రాల తనిఖీ

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లోని కళ్యాణి, ఊర్వశి సినిమా థియేటర్లను తహసీల్దార్ జితేంద్రకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. థియేటర్ యజమానుల నుంచి బీ-ఫారం లైసెన్స్, ఏ సినిమా వేయబోతున్నారు, ప్రస్తుతం రోజుకు ఎన్ని షోలు రన్ చేస్తున్నారు, లైసెన్స్ వ్యాలిడ్‌లో ఉందా, సినిమాహాల్‌లో ఎన్ని సీట్లు ఉన్నాయనే వివరాలు సేకరించారు. ప్రస్తుతం రెండు సినిమా హాల్స్ రెండు నెలలుగా మూతపడ్డాయని, ఎటువంటి సినిమా రన్ చేయడంలేదని థియేటర్ యజమానులు స్పష్టం చేశారు.

■ **కంభం:** స్థానిక గ్యాస్ గోడౌన్, ఎంఎల్‌ఎస్ గోడౌన్, హైవే వెంట ఉన్న పెట్రోల్‌బంక్, బస్టాండు సమీపంలోని రైస్‌మిల్లు, ఆర్వో ప్లాంట్లు, ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలను తహసీల్దార్ కిరణ్ శుక్రవారం తనిఖీ చేసారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వినియోగదారులకు సేవలందించాలని సూచించారు. కంభం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా బెంచ్‌లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

■ **గిద్దలూరు రూరల్:** పట్టణంలోని సినిమా థియేటర్లు, గ్యాస్ గోడౌన్లు, రైస్‌మిల్లులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని క్యాంటీన్లు, పలు ఆర్వో ప్లాంట్లను తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామనారాయణరెడ్డి, ఆర్ఐ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

■ **మార్కాపురం టౌన్:** స్థానిక ఆర్టీసీ డిపోను తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం తనిఖీ చేశారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డీఎం నరసింహులును కోరారు. దుకాణదారులు ఎంఆర్‌పీ ధరకే తినుబండారాలు, వస్తువులు విక్రయించాలని స్పష్టం చేశారు.

■ **పొదిలి:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని క్యాంటీన్‌ను నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా స్థానిక హరికృష్ణ, రాఘవేంద్ర థియేటర్లను తనిఖీ చేశారు. హాల్లో వసతులు, టికెట్ ధరలు, తినుబండారాల ధరల గురించి ఆరా తీశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరరావు పాల్గొన్నారు.


కంభం బస్టాండ్ సమీపంలోని రైస్‌మిల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్


మార్కాపురం బస్టాండ్‌లో దుకాణాలు పరిశీలిస్తున్న తహసీల్దార్, డీఎం